

www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY



సంపుటి: 02 | సంచిక: 268 | హైదరాబాద్ | బుధవారం | 21-01-2026 | పేజీలు: 08


# దావోస్‌లో తెలంగాణకు అంతర్జాతీయ మద్దతు



**గూగుల్, ఇజ్రాయెల్, యూఏఈతో భాగస్వామ్యాలు**

**తెలంగాణ రైజింగ్ విజన్‌ను వివరించిన సీఎం రేవంత్**

**రాష్ట్రంతో వ్యవసాయం, వాతావరణ, స్టార్టప్‌లలో గూగుల్ భాగస్వామ్యం**

**హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా తీర్చిదిద్దే ప్రణాళికపై చర్చ**

**ఏఐ, అగ్రిటెక్, హెల్త్‌టెక్ రంగాల్లో ఇజ్రాయెల్ స్టార్టప్‌ల మద్దతు**

**తెలంగాణలో పైలట్ ప్రోగ్రామ్స్ కోసం భాగస్వామ్యానికి ఒప్పందం**

**ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో యూఏఈ సహకారం**

**30 వేల ఎకరాల్లో నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్**

**స్మార్ట్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపకల్పన**

**ఇరు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు గూగుల్, ఇజ్రాయెల్, యూఏఈ వంటి అంతర్జాతీయ భాగస్వాములు మద్దతు ప్రకటించగా, రాష్ట్ర అభివృద్ధి, వ్యవసాయం, వాతావరణ, పట్టణ సమస్యల పరిష్కారంలో సహకారం అందించడానికి ఆసక్తి చూపారు. గూగుల్ వాతావరణ మార్పులు, వ్యవసాయం, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్, వ్యవసాయం వంటి రంగాల్లో సహకారం పంచేందుకు గూగుల్ ఆసక్తి వ్యక్తం చేసింది.

సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. సమావేశంలో వాతావరణ మార్పులు, వ్యవసాయ ప్రభావాలు, పట్టణ కాలుష్య నియంత్రణలపై చర్చలు జరిపారు. జిల్లా అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి నమూనాలను సీఎం వివరించారు. ప్రత్యేకంగా హైదరాబాద్ సిటీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలపై చర్చ జరిగింది. ఇజ్రాయెల్ ఇన్నోవేషన్

..మిగతా 2లో



# సిట్ విచారణ కాదు.. పిచ్చి విచారణ

## నిలదీస్తే కేసులా..?

మీది కాంగ్రెస్ కాదు.. స్కామ్ గ్రెస్

లీకులతో ఇంకెన్ని రోజులు కాలం గడుపుతారు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును సిట్ విచారించడం సిట్ విచారణ కాదని, పిచ్చి విచారణ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. న్యాయం కోసం తాము హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకైనా వెళతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక నిలదీసిన వారిపై కేసులు నమోదు చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి టెండర్ల కుంభకోణంలో అసలు సూత్రధారి సీఎం బావమరిది సృజన్‌రెడ్డేనని ఆరోపించారు. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసు పసలేని కేసు అని గతంలో సుప్రీంకోర్టే చెప్పింది. అయినా గూడా ఆ కేసును సాగదీయడంలో

..మిగతా 3లో

# రాష్ట్రంలో ఖరీఫ్ నాటికి యూరియా యాప్

**ఆర్గానిక్ పంటల ప్రమాణీకరణకు యాప్**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి**

**ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష**

**రైతులకు పథకాలు అందించాలని ఆదేశాలు**



02

# బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్

**ప్రధాని మోడీ సహా పార్టీ ముఖ్య నేతలు హాజరు**

02

**నితిన్ నబీన్ తనకు బాస్ అంటూ మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు**

**పార్టీ వ్యవహారాల్లో అధ్యక్షుడితే తుది నిర్ణయమని వెల్లడి**



# సింగరేణి స్కాంపై సీబీఐ విచారణ చేపట్టండి

**కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన హరీష్ రావు**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ప్రత్యేక లేఖ**

**సింగరేణిలో అవకతవకలపై సుధీర్ఘ వివరణ**

**అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని డిమాండ్**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

సింగరేణి బొగ్గు కుంభకోణంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బామ్మర్ది సృజన్ రెడ్డితో

..మిగతా 2లో

# దావోస్ లో కీలక ఒప్పందాలు

పలు అంశాలను వివరించిన రైజింగ్ టీం

యంగ్ ఇండియాకు సాదీ ఇంట్రెస్ట్

ఏఐతో భాగస్వామ్యానికి రాయల్ ఆసక్తి

ఫ్యూచర్ సిటీకి యూఏఈతో ఒప్పందం

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణ రైజింగ్ బృందానికి దావోస్ టూర్ కలిసి వస్తోంది. ఈ సందర్భంగా పలు రంగాల్లో ఒప్పందాలు కుదురుతున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా

..మిగతా 3లో




# గ్రామీణ ఉపాధిని నాశనం చేస్తే సహించం

**కేంద్రానికి రాహుల్ గాంధీ హెచ్చరికలు**

**అంబానీ, అదానీల కోసమే ఆర్థిక విధానాలంటూ ఆగ్రహం**

03

**గాంధీ పేరు తొలగించడం చరిత్రకే అవమానమని వ్యాఖ్యలు**

**కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా యూపీలో మహాపంచాయతీలు**

**రాయ్‌బరేలీ పర్యటనలో రాహుల్ వెల్లడి**



# పొలిటికల్ ట్యాపింగ్..?!

సిట్ విచారణకు మాజీ మంత్రి హరీష్

గతంలోనే ఇదే కేసులో ఊరట

మళ్లీ నోటీసులిచ్చి విచారణకు పిలిచిన సిట్

అధికార, విపక్షం మధ్య రాజుకున్న నిప్పు



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు జారీ చేయడంతో పరిస్థితి మారిపోయింది. మంగళవారం ఉదయం హరీశ్ రావు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. ఆయనను సీపీ సజ్జనార్ నేతృత్వంలోని సిట్ అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. హరీష్ రావుతో పాటు వెళ్లిన ఆయన న్యాయవాదులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. నోటీసులు ఇచ్చిన కేసులో హరీశ్ రావుకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని ఆయన తరపు న్యాయవాదులు స్పష్టం చేశారు. ఇది పూర్తిగా రాజకీయ

..మిగతా 3లో

# దుర్గంచెరువు దుర్గంధంపై హైడ్రా నజర్

సమన్వయంతో సమస్య పరిష్కారానికి చర్యలు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

మాధాపూర్ గుట్టల్లో ఉన్న దుర్గం చెరువు దుర్గంధంపై హైడ్రా దృష్టి పెట్టింది. చెరువులోకి నేరుగా మురుగు నీరు చేరడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. దుర్గంచెరువులో గుర్రపు డెక్క వ్యాప్తి చెందడం.. దుర్గంధంగా మారడంపట్ల మీడియా కథనాలు, స్థానికుల నుంచి హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు మంగళవారం దుర్గం చెరువును పరిశీలించారు. చెరువులో సగభాగం వరకూ గుర్రపు డెక్క వ్యాపించడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఎస్‌టీపీలు ఉన్నప్పటికీ వరద కాలువ ద్వార మురుగు నీరు నేరుగా దుర్గం చెరువులోకి

..మిగతా 2లో





## రాష్ట్రంలో ఖరీఫ్ నాటికి యూరియా యాప్

- **ఆర్గానిక్ పంటల ప్రమాణీకరణకు యాప్**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి**
- **ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష**
- **రైతులకు పథకాలు అందించాలని ఆదేశాలు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాష్ట్రంలో వచ్చే ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ శాఖ యూరియా యాప్‌ను అమల్లోకి తేనుందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. కేంద్ర ఫెర్టిలైజర్ శాఖ కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్‌ను అభినందించిందని తెలిపారు.

మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, కోఆపరేషన్, హార్టికల్చర్ శాఖల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, తెలంగాణ విజన్ 2047 వంటి ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, రైతుల వరకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో చేరేలా ప్రచారం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నప్పటికీ మార్కెట్లో నకిలీ ఉత్పత్తులు చేరడం వల్ల రైతులకు నష్టం చేకూరుతున్నందున, నిజమైన ఆర్గానిక్ పంటలకు సర్టిఫికేషన్ ఇచ్చే యాప్ తీసుకురానున్నారు. యాప్ ద్వారా కొనుగోలుదారులు పంట ఎక్కడ, ఏ రైతు, ఎలా పండించాడో తెలుసుకోవచ్చు. అలాగే అగ్రివర్సిటీలలోని ఖాళీ ప్రదేశాల్లో పంటలు పండించి, అక్కడే స్టాల్స్ ఏర్పాటు చేస్తే రైతులు ఆర్గానిక్ పంటల వైపు ఎక్కువగా ఆకర్షితులవుతారు.

వర్తమాన యాంత్రీకరణ పథకంలో ఇప్పటికే రూ. 50 కోట్లు ఖర్చు చేశారు, మరో రూ. 50 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. రైతులకు కావాల్సిన యంత్రాలు మార్కెట్ ధరలకు లభించేలా, సబ్సిడీ నేరుగా రైతులకు చేరేలా నిబంధనలు రూపొందించాలని అధికారులు ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి సక్రమంగా అమలు చేస్తున్నట్లు, ప్రతి పైసా వృథా కాకుండా ఉపయోగించాల్సిందిగా సూచించారు. వచ్చే ఖరీఫ్‌కు పెద్ద యూరియా బఫర్ స్టాక్‌లను ఏర్పాటు చేయాలని, భవిష్యత్తులో ఎరువుల కొరత రాకుండా చూసుకోవాలని, రైల్వే రేక్ పాయింట్లను సరైన విధంగా అమర్చాలని ఆదేశించారు.అధిక ఖచ్చితత్వంతో శాటిలైట్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ నెలాఖరు నాటికి పంటల మ్యాపింగ్ డేటా అందించాలని, మూడు సంవత్సరాల డేటా ఫీల్డ్ వెరిఫికేషన్‌తో ఫైనలైజ్ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ డిపాజిట్లు ప్రైవేట్ బ్యాంకులకోసం కాకుండా కోఆపరేటివ్, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల్లో చేయాలని, ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లక్ష్యాలను రెట్టింపు చేయాలని, తక్కువ పురోగతి ఉన్న కంపెనీలను రద్దు చేసి కొత్త కంపెనీలకు కేటాయించాలన్నారు. మోడల్ పామ్‌ను అభివృద్ధి చేసి రైతుల సందర్శనార్థం అందుబాటులో ఉంచాలని, కేంద్రానికి ఆయిల్ పామ్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచేలా లేఖ రాయాలని సూచించారు. రాష్ట్ర అవసరాల కోసం కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్న నేపథ్యంలో కూరగాయల సాగును ప్రోత్సహించాలి. విజయవంతమైన రైతులను ఇతర రైతులకు మార్గదర్శకంగా రైతు నేస్తం కార్యక్రమం ద్వారా పరిచయం చేయాలని, పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ టెర్రస్ పంటల ప్రాధాన్యతను పెంచాలని ఆదేశించారు. రైతుల వేదికల దగ్గర సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేసి మిగిలిన కరెంట్‌ను గ్రిడ్‌కి అమ్మే అవకాశం ఉండేలా చూడాలని సూచించారు. ఇప్పటికే రెండు వేదికలలో ప్రయోగాత్మకంగా సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేసి నెలకు 400 యూనిట్ల వరకు మిగులు కరెంట్ ఉత్పత్తి అవుతుందన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ డైరెక్టర్ గోపి, హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హకా ఎండి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు బండ్ల గణేష్ 'మహా పాదయాత్ర'!

**దేవరకద్ర నియోజకవర్గం, జనవరి 20 (సిద్దిపేట పవర్):**

భూత్పూర్ దగ్గర పాదయాత్ర లో పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి తన కోరిక తీరడంతో మొక్కు తీర్చుకోనున్న బండ్ల ఈ నెల 19వ తేదీన షాద్‌నగర్‌లోని తన స్వగృహం నుంచి పాదయాత్ర ప్రారంభించిన అని కాలినడకన తిరుమల తిరుపతి దేవస్థానం చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్న బండ్ల గణేష్ తెలియజేశారు.



# దావోస్‌లో తెలంగాణకు అంతర్జాతీయ మద్దతు

**మొదటిపేజీ తరువాయి**

అథారిటీతో సమావేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్‌టెక్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్ రంగాల్లో స్టార్టప్‌లకు మద్దతు, పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించడానికి ఒప్పందాలు చర్చించబడ్డాయి. తెలంగాణలో ఇన్నోవేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి ఇజ్రాయెల్ భాగస్వామ్యం పంచుతుందని ప్రకటించింది. సదస్సులో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో తెలంగాణతో కలిసి పని చేయడానికి ఆసక్తి చూపారు. 30,000 ఎకరాల్లో విస్తరించే ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దారని, ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాసం, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో ఇప్పటికే మారుబెనీ, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. రిలయన్స్ గ్రూప్ 'వన్‌తారా' పేరుతో ఫ్యూచర్ సిటీలో జూ పార్క్ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సీఎం తెలిపారు. యూఏఈ ప్రభుత్వం ఫుడ్ క్లస్టర్ ద్వారా గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించింది. ప్రాజెక్ట్ వేగవంతం చేయడానికి రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచన జరిగింది. దావోస్‌లో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో మంత్రులు దుద్దిళ్ల, పొంగులేటి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మద్దతుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్, హెల్త్‌టెక్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్ రంగాల్లో కొత్త స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ భాగస్వామ్యం పంచుతుంది. ఈ భాగస్వామ్యం ద్వారా ఇజ్రాయెలీ స్టార్టప్‌లతో తెలంగాణలో పైలట్ ప్రోగ్రామ్లు ప్రారంభించనున్నట్లు ప్రకటించబడింది.

సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు సంబంధించి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ దేశంలోనే తొలి నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతుందని, సుమారు 30,000 ఎకరాల్లో విస్తరించి, పలు రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తారని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో ఇప్పటికే అంతర్జాతీయ సంస్థలు, స్థానిక పెట్టుబడిదారులు భాగస్వాములుగా ఉన్నారు. రైతు, గ్రామీణ, పరిశ్రమల ఆధారిత ఆర్థిక వ్యవస్థల అభివృద్ధికి యూఏఈ ప్రభుత్వం మద్దతు ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటుతో ప్రాజెక్ట్ వేగవంతం అవుతుంది.

దావోస్ వేదికపై మంత్రి దుద్దిళ్ల, పొంగులేటి ఇతర అధికారులు వ్యవసాయం, వాతావరణ మార్పులు, ఇన్నోవేషన్, స్టార్టప్‌ల అభివృద్ధి అంశాలను చర్చించారు. ఈ సమావేశం ద్వారా తెలంగాణలో సాంకేతిక, వ్యాపార, వ్యవసాయ రంగాలకు గ్లోబల్ భాగస్వామ్యాలు పెరుగుతాయని ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణ రాష్ట్రం ఫార్మా, లైఫ్ సైన్స్, సెమీకండక్టర్, ఏఐ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం పలికింది. రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలో రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించినట్లు మంత్రి వివరించారు. లైఫ్ సైన్స్ పాలసీ 2.0, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ వంటి ప్రాజెక్టులను దావోస్ వేదికలో ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ఆధునిక, సుస్థిర, గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్ది, 2047 నాటికి ప్రాంతీయ, దేశీయ ఆర్థికాభివృద్ధికి కేంద్ర బిందువుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో స్టార్టప్‌లు, పరిశ్రమలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం తదితర రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని ప్రభుత్వం భావిస్తోంది.





## దుర్గంచెరువు దుర్గంధంపై హైడ్రా నజర్

**మొదటిపేజీ తరువాయి**

కలవడం పట్ల కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌టీపీలకు వెళ్లే మురుగు నీరు అధికంగా ఉండడంతో ఇటువైపు మళ్లించాల్సి వచ్చిందని అక్కడ ఇరిగేషన్ ఇంజినీర్లు చెప్పగా అది సరికాదన్నారు. ఎస్‌టీపీల సామర్థ్యానికి మించిన మురుగు నీరు వస్తే మురుగు కాలువకు మళ్లించాలి కాని.. నేరుగా చెరువులోకి ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ఒకవైపు ఎస్‌టీపీ ద్వారా మురుగు నీటిని సుద్ధి చేసి చెరువులోకి పంపడం.. మరో వైపు నేరుగా మురుగు నీరు వదిలేయడం ఏంటని మండిపడ్డారు.

**సమన్వయంతో పని చేయాలి..**

చెరువును అభివృద్ధి చేయడం అంటే పైపై మెరుగులు దిద్దడం కాదని దుర్గం చెరువు పనులు చేపట్టిన రహేజా సంస్థ ప్రతినిధులను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ప్రశ్నించారు. చెరువులోకి మురుగు నీరు కలవడం.. గుర్రపు డెక్క వ్యాప్తి చెందడాన్ని నియంత్రించడానికి మీ వైపు చేసిన ప్రయత్నాలు ఏంటని అడిగారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖ, రహేజా మైండ్‌స్పేస్, ఎస్‌టీపీల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రాంకీ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం, బాధ్యత పడకపోవడమే దుర్గం చెరువు దుర్గంధానికి కారణమని హైడ్రా కమిషనర్ తెలిపారు. చుట్టుపక్కల మురుగు నీరంతా ఎస్‌టీపీ లైన్లోకి వెళ్లేలా జాగ్రత్త పడాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌టీపీల వద్ద మురుగు నీరు శుభ్రం అయిన తర్వాత నీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం పీసీబీకి పంపాలని హైడ్రా కమిషనర్ అధికారులను ఆదేశించారు.

**సంబంధిత శాఖల అధికారులతో సమావేశం**

దుర్గం చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం హైడ్రా కార్యాలయంలో చెరువు పరిరక్షణ బాధ్యతలు చేపట్టిన అన్ని సంస్థలతో హైడ్రా కమిషనర్ సమావేశమయ్యారు. వరద కాలువలోకి మురుగు నీరు వెళ్లకుండా పైపులైను డైవర్షన్ పనులు చేపట్టడానికి జలమండలికి ఉండే ఇబ్బందులను తొలగించారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. ఎం రమేష్ గారితో మాట్లాడి ట్రాఫిక్ డైవర్షన్‌కు సహకరించాలని సూచించారు. అలాగే ఇరిగేషన్, విద్యుత్, జీహెచ్ ఎంసీ, జలమండలి విభాగాధికారులతో కూడా మాట్లాడి మురుగునీరు దుర్గం చెరువులోకి చేరకుండా చేపట్టే పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. ఇదే సమయంలో చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన రహేజా సంస్థ ప్రతినిధులతో కూడా మాట్లాడి ఇన్ ఆర్బిట్ మాల్, నెక్టర్ గార్డెన్స్ ఇలా పై భాగంలోని ఐటీ సంస్థల నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి కలవకుండా చెరువుకు ఆనుకుని పడమర వైపు కాలువను తవ్వేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్

- **ప్రధాని మోడీ సహా పార్టీ ముఖ్య నేతలు హాజరు**
- **నితిన్ నబీన్ తనకు బాస్ అంటూ మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు**
- **పార్టీ వ్యవహారాల్లో అధ్యక్షుడితే తుది నిర్ణయమని వెల్లడి**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

భారతీయ జనతా పార్టీకి కొత్త జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పార్టీ సీనియర్ నేతలు, కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి.

పార్టీ వ్యవహారాల్లో నితిన్ నబిన్ తనకు బాస్ అని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య స్పష్టమైన తేడా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ వ్యాఖ్యలు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలోనూ పార్టీ అధ్యక్షుల మార్పు సమయంలో ఇదే తరహా వ్యాఖ్యలు చేశానని గుర్తు చేశారు. పార్టీ వ్యవహారాల్లో అధ్యక్షుడే తుది నిర్ణయం తీసుకుంటారని, తాను కూడా ఒక సాధారణ కార్యకర్తగానే ఉంటానని మోడీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, తాను కూడా పార్టీ కార్యకర్తగా తన పని గురించి కొత్త అధ్యక్షుడికి వివరించానని చెప్పారు. ఇకపై తన పనితీరుపై గోప్య నివేదిక రాయాల్సింది పార్టీ అధ్యక్షుడేనని సరదాగా వ్యాఖ్యానించారు. పార్టీ విషయాల్లో నితిన్ నబిన్ మార్గదర్శకత్వాన్ని ఎదురు చూస్తున్నానని ప్రధాని అన్నారు.

నితిన్ నబిన్ వయస్సు కేవలం 45 ఏళ్లు మాత్రమే కావడంతో, ఆయన తరం గురించి కూడా మోడీ ప్రస్తావించారు. బాల్యంలో రేడియోలో వార్తలు వింటూ పెరిగిన తరం నుంచి, ఇప్పుడు కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతికతను సులభంగా ఉపయోగించగల తరం వరకు నితిన్ నబిన్ ప్రయాణం ప్రతిబింబిస్తుందని అన్నారు. ఇది పార్టీకి భవిష్యత్ దిశలో ఎంతో ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు. పార్టీ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ నియామకం సోమవారం ఖరారైంది. దాదాపు ఏడాది కాలంగా కొనసాగిన పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ అనంతరం, ఆయన పేరుతో వచ్చిన 37 నామినేషన్లు చెల్లుబాటు కావడంతో ఎటువంటి పోటీ లేకుండా ఆయనను జాతీయ అధ్యక్షుడిగా ప్రకటించారు. పార్టీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ కే లక్ష్మణ్ ఆయనకు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, రోడ్లు మరియు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సహా పలువురు మాజీ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు. పార్టీ నాయకత్వంలో మార్పులు జరిగినా, సిద్ధాంతాలు మారవని ప్రధాని స్పష్టం చేశారు. బీజేపీలో అధ్యక్షులు మారుతారు కానీ ఆలోచనా ధోరణి, దిశ మారదని అన్నారు. రాజకీయ అంశాలపై మాట్లాడిన ప్రధాని, దేశ భద్రతకు అక్రమ వలసదారులు పెద్ద ముప్పుగా మారుతున్నారని అన్నారు. వారిని గుర్తించి దేశం వెలుపలికి పంపడం అవసరమని స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తూ, ఆ పార్టీ చేసిన తప్పుల నుంచి బీజేపీ కార్యకర్తలు పాఠాలు నేర్చుకోవాలని మోడీ సూచించారు. 1984లో కాంగ్రెస్ పార్టీ 400కు పైగా లోక్ సభ స్థానాలు గెలిచి, 50 శాతానికి పైగా ఓట్లు సాధించిందని గుర్తు చేశారు. అలాంటి పార్టీ ఇప్పుడు 100 సీట్ల కోసం ఆశపడే స్థితికి చేరిందని అన్నారు. దీనికి కారణం పార్టీ లోపల ఆత్మపరిశీలన లేకపోవడమేనని వ్యాఖ్యానించారు. దీనికి భిన్నంగా, బీజేపీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కూడా తన పనితీరును నిష్పక్షపాతంగా సమీక్షించుకుంటుందని ప్రధాని చెప్పారు. ఓడిపోయిన ప్రాంతాల్లో లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతుందని తెలిపారు. మహారాష్ట్రలో జరిగిన ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నితిన్ నబిన్ కూడా ప్రసంగించారు. పార్టీతో తన అనుబంధం, కార్యకర్తగా తన ప్రయాణాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన పార్టీ కేంద్ర నాయకత్వానికి, కోట్లాది కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో పార్టీ ముందు ఉన్న సవాళ్లను కూడా నితిన్ నబిన్ వివరించారు. త్వరలో తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. ఈ రాష్ట్రాల్లో జనాభా మార్పులు రాజకీయ పరిస్థితులను ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. ఈ మారుతున్న పరిస్థితులను పార్టీ వ్యూహాత్మకంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు చేస్తూ, అవి సంస్కృతి, సంప్రదాయాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయని నితిన్ నబిన్ ఆరోపించారు. తమిళనాడులో కార్తీక దీపం పండుగపై ఏర్పడిన వివాదాన్ని ఆయన ప్రస్తావించారు. పవిత్ర సంప్రదాయాలను అడ్డుకునే ప్రయత్నాలను బీజేపీ సహించబోదని స్పష్టం చేశారు. రామసేతు ఉనికిని ప్రశ్నించే వారు, సంప్రదాయ పండుగలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారు భారత రాజకీయాల్లో స్థానం పొందకూడదని నితిన్ నబిన్ అన్నారు. దేశ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను కాపాడటం పార్టీ బాధ్యత అని చెప్పారు. ఈ విధంగా నితిన్ నబిన్ అధ్యక్షత్వంలో బీజేపీ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. రానున్న ఎన్నికలు, రాజకీయ పరిణామాల మధ్య పార్టీని ఏకతాటిపై నడిపించడం ఆయన ముందున్న ప్రధాన సవాలుగా మారనుంది.



## సింగరేణి స్కాంపై సీబీఐ విచారణ చేపట్టండి

**మొదటిపేజీ తరువాయి**

కలిసి ఈ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరయ్యే ముందు ఈ లేఖను హరీశ్‌రావు మీడియా సాక్షిగా విడుదల చేశారు.

లేఖలో సింగరేణి కాలరీస్ కంపెనీలో ఇటీవల జరుగుతున్న పరిణామాలను వివరించారు. 2024లో తెలంగాణలో ప్రభుత్వం మారిన తర్వాత సింగరేణిలో టెండర్ విధానంలో కీలక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. టెండర్లలో పాల్గొనాలంటే తప్పనిసరిగా సైట్ విజిట్ సర్టిఫికేట్ ఉండాలనే కొత్త నిబంధనను ప్రవేశపెట్టారని తెలిపారు. ఇలాంటి విధానం సింగరేణి చరిత్రలో గతంలో ఎప్పుడూ లేదని, కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా ఈ నిబంధనను అనుసరించడం లేదని స్పష్టం చేశారు. ఈ కొత్త నిబంధన పేరుతో కొందరు ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకే లాభం చేకూర్చేలా టెండర్లు కట్టబెడుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనస్ 7 శాతం నుంచి మైనస్ 20 శాతం వరకు తక్కువ ధరలకు ఖరారైన టెండర్లను రద్దు చేసి, ఇప్పుడు ప్లస్ 7 శాతం నుంచి ప్లస్ 10 శాతం వరకు అధిక ధరలకు కొత్త కాంట్రాక్టులు ఇస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ నిర్ణయాల వల్ల సింగరేణికి వందల కోట్ల రూపాయల మేర ఆర్థిక నష్టం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

డీజిల్ కొనుగోలు విషయంలో కూడా తీవ్ర అవకతవకలు జరిగాయని హరీశ్‌రావు తెలిపారు. గతంలో ఐఓసీఎల్ నుంచి నేరుగా బల్క్ డీజిల్ కొనుగోలు చేసే విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. ఆ విధానాన్ని నిలిపివేసి, డీజిల్ కొనుగోలు బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగించారని ఆరోపించారు. దీని వల్ల ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిందని, అదనంగా జీఎస్టీ భారం కూడా పడుతోందని తెలిపారు. ఇది సింగరేణి ఆర్థిక ప్రయోజనాలకు పూర్తిగా విరుద్ధమని అన్నారు. గత రెండేళ్లుగా సింగరేణికి శాశ్వత సీఎండీ లేకపోవడం కూడా ఈ అక్రమాలకు కారణమని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు. సంస్థను కేవలం ఇన్‌ఛార్జ్ సీఎండీతోనే నడిపిస్తున్నారని తెలిపారు. ఈ నాయకత్వ శూన్యత వల్ల సరైన మానిటరింగ్ లేకుండా ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కీలక పాలసీ నిర్ణయాలు తీసుకునే సమయంలో బాధ్యతాయుతమైన పర్యవేక్షణ కనిపించడం లేదని విమర్శించారు.

సింగరేణి బోర్డులో ఉన్న కేంద్ర ప్రభుత్వ నామినేటెడ్ డైరెక్టర్ల పాత్రపై కూడా హరీశ్‌రావు ప్రశ్నలు లేవనెత్తారు. నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా వారు మౌనంగా ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర డైరెక్టర్లపై ఉందని గుర్తుచేశారు. అయినా వారు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఈ అక్రమాలపై అంతర్గత విచారణ గానీ, రాష్ట్ర ప్రభుత్వ విచారణ గానీ సరిపోవని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కేవలం స్వతంత్ర సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటకు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2024 తర్వాత సింగరేణిలో తీసుకున్న అన్ని టెండర్లు, పాలసీ నిర్ణయాలు, కాంట్రాక్టులపై సమగ్రంగా సీబీఐ విచారణ జరిపించాలని కేంద్ర బొగ్గు గనుల మంత్రిని లేఖలో కోరారు. సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి అని, అక్కడ జరిగే ప్రతి రూపాయి ఖర్చు ప్రజా ధనమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ సంస్థను కొందరి స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటే సహించబోమని హెచ్చరించారు. సింగరేణిలో జరిగిన అక్రమాలపై నిజాలు వెలుగులోకి వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.



# దావోస్ లో కీలక ఒప్పందాలు

**మొదటిపేజీ తరువాయి**

అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హెచ్.ఈ. అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక -2026 సదస్సులో భాగంగా దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డితో యూఏఈ మంత్రి మంగళవారం భేటీ అయ్యారు. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిద్దడమే లక్ష్యమని చెప్పారు.భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇది దేశంలోనే తొలి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల్లో విస్తరించే ఈ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ లో ఇప్పటికే మారుబేని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని, ఇటీవలే రిలయన్స్ గ్రూప్ వంతారాతో ఫ్యూచర్ సిటీలో కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సీఎం వెల్లడించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రాజెక్ట్ వేగవంతమయ్యేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సౌదీ సంస్థ ఆసక్తి**

సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్ పర్టైజ్' స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యమయ్యేందుకు ఆసక్తి వ్యక్తం చూపింది. సంస్థ ప్రెసిడెంట్ , సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్, దావోస్‌లో 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థకు ఉద్యోగ అవకాశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, ప్రాక్టికల్ శిక్షణ అందించడమే స్కిల్ యూనివర్సిటీ ప్రధాన ఉద్దేశమన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 2047 విజన్‌కు అనుగుణంగా తెలంగాణను భవిష్యత్‌కు సిద్ధమైన ప్రతిభా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రాథమిక విద్య, ఆధునిక నైపుణ్యాలు, శిక్షణ, మెంటార్‌షిప్ ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం సాధించడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. భారతదేశంలో పూర్తిగా పరిశ్రమల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న తొలి విశ్వవిద్యాలయం స్కిల్ యూనివర్సిటీయే నని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ పర్టైజ్ సంస్థ సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా సుమారు 5వేల మంది నైపుణ్య కలిగిన సిబ్బందిని నియమించుకునే అవసరం తమకు ఉందని, ఆ అవసరాలను తీర్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యం చేసుకోవాలని ప్రతిపాదించారు. అవసరమైన అన్ని విభాగాల్లో శిక్షణను యూనివర్సిటీతో కలిసి ప్రారంభించాలనుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో ఈ సంస్థ, పెట్రో కెమికల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎరువులు, స్టీల్, సిమెంట్, వాటర్ ట్రీట్‌మెంట్, విద్యుత్ ఉత్పత్తి వంటి నైపుణ్యాధారిత రంగాల్లో ప్లాంట్ నిర్వహణ సేవలను అందిస్తోంది.

**ఏఐ రంగంలో రాయల్ ఫిలిప్స్ ఆసక్తి**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్యమయ్యేందుకు ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి వ్యక్తం చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై కూడా చర్చించేందుకు ముందుకొచ్చింది. తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఫిలిప్స్ గ్లోబల్ నాయకత్వంతో భేటీ అయ్యారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ , గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్- స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఏఐ రంగంలో తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత సేవలపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'తెలంగాణ నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030' గురించి ప్రతినిధి బృందం వివరించింది. 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించడమే ఈ విధాన లక్ష్యమని, మెడికల్ ఎలక్ట్రానిక్స్ సహా అనుబంధ రంగాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు.

**వేగంగా అభివృద్ధి : సీఎం**

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఔషధ తయారీ, పరిశోధనాభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగాల్లో ప్రపంచ స్థాయి, స్థిరమైన పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ (ORR) , రీజినల్ రింగ్ రోడ్ (RRR) మధ్య ఉన్న ప్రాంతంలో పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ (PURE) తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కొత్త లైఫ్ సైన్సెస్ విధానం, ఔషధ తయారీ వ్యూహాలు కలిసి తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పునాది వేస్తాయని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, బలమైన ఐటీ-లైఫ్ సైన్సెస్-హెల్త్ కేర్ టాలెంట్ బేస్, జీనోమ్ వ్యాలీ, 300 ఎకరాలకుపైగా విస్తరించిన మెడికల్ డివైసెస్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఉన్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ వైద్య పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇక్కడి ఆస్పత్రులు ఇప్పటికే క్రిటికల్ కేర్, అంబులెన్స్ సేవలు వంటి రంగాల్లో ఏఐను సమర్థవంతంగా వినియోగిస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఏఐకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. "ఇదే సరైన సమయం. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయడానికి ఇది ఉత్తమ అవకాశమని" మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు వచ్చి.. జీనోమ్ వ్యాలీని సందర్శించాలని మంత్రి ఫిలిప్స్ నాయకత్వాన్ని ఆహ్వానించారు.

**ఇది ప్రశంసనీయం : రాయల్ ఫిలిప్స్**

రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్- స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో తెలంగాణ చేపడుతున్న ఏఐ ఆధారిత మార్పు అత్యంత ప్రశంసనీయమని అన్నారు. తమ నెదర్లాండ్స్ ప్రధాన కార్యాలయాన్ని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సందర్శించాలని ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు.



# సిట్ విచారణ కాదు.. పిచ్చి విచారణ

**మొదటిపేజీ తరువాయి**

అర్థం ఏముంది..? ఈ కేసుకు సంబంధించి సిట్‌గానీ, సర్కారుగానీ ఒక్క ప్రెస్‌మీట్ అయినా పెట్టి అధికారికంగా మాట్లాడిందా..? ఒక్కరిపైన అయినా నేరం రుజువైందా..? తప్పు జరిగింది అంటరు. మరి ఎందుకు నిరూపించలేకపోతున్నరు..?' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

**మాకు బాధ్యత ఉంది.. అందుకే వెళ్తాం**

ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు బాధ్యతాయుతమైన నాయకుడిగా హరీష్ రావు సిట్ విచారణకు హాజరయ్యారని, తాము ఎటూ పారిపోమని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డికి డబ్బుల కట్టలతో దొరికిన నేరచరిత్ర ఉన్నదని, అదే తరహా కేసుల్లో అదే అందరికీ అది అంటించాలని చూస్తున్నాడని, అడ్డగోలు సిట్ విచారణల పేరుతోనే ఎన్ని రకాల తమాషాలు చేసినా కాంగ్రెస్ పార్టీ హామీల వైఫల్యం, పరిపాలన వైఫల్యంపై ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అధికారం అందలం ఎక్కిచ్చిన బుద్ధి మాత్రం బురదలోనే రేవంత్ రెడ్డిదే ఉన్నదని, కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కామ్ గ్రేస్...ఒక మంత్రి 20% శాతం, ఇంకో మంత్రి బ్యాగ్ మాన్ ఇలా రేవంత్ రెడ్డి తన మంత్రులందరికీ డబ్బుల సంచి పంపించినట్లు ఉన్నారని, అందుకే డిప్యూటీ సీఎం భట్టి సహా అంతా మౌనంగా ఉంటున్నారన్నారు. ఈ మొత్తం ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఒక్క అధికారి కూడా ఇప్పటిదాకా ఎందుకు బయటకు మాట్లాడలేదని కేటీఆర్ ప్రశ్నించారు.

**లీకులతో ఇంకెన్ని రోజులు బతుకుతారు**

ఆ విచారణ.. ఈ విచారణ.. ఆయన అవినీతి, ఈయన రాసలీలలు అంటూ కేవలం లీకులు ఇచ్చి ఎన్ని రోజులు ఇలా బతుకుతావని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, అధికారిక సమాచారం లేకుండా ఎన్ని రోజులు ఈ తమాషాలు నడిపిస్తారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఒక్క అధికారిక ప్రకటన రాలేదని, గతంలో హరీష్‌రావుపై నమోదైన అక్రమ ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. కేవలం హరీష్‌రావుపై కుట్రతో జైలుకు పంపించాలన్న దురుద్దేశంతోనే సుప్రీంకోర్టులో ప్రజల డబ్బులు పెట్టి మరీ ప్రభుత్వం వాదించిందన్నారు. తాజాగా హరీష్ రావు.. సీఎం బావమరిది బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందు వల్లనే సాయంత్రం వరకూ నోటీసులు హరీష్ రావుకు ఇచ్చారన్నారు. హరీష్ రావు బొగ్గు కుంభకోణంలో బయటపెట్టిన సమాచారం తప్పు అయితే సంబంధిత మంత్రి, సింగరేణి అధికారులు ఇప్పటిదాకా ఒక్కరూ ఎందుకు మాట్లాడలేదని కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ కుంభకోణాలను బయటపెట్టిన ప్రతిసారి రాష్ట్ర ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నదని మండిపడ్డారు.






# పొలిటికల్ ట్యాపింగ్..?!

**మొదటిపేజీ తరువాయి**

ఉద్దేశాలతో సాగుతున్న ప్రక్రియ అంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. మరోవైపు, హరీష్ రావును దాదాపు 7 గంటలు విచారించిన సిట్.. మళ్లీ పిలుస్తామంటూ వదిలేసింది.

**గతంలోనే కోర్టుకు..?**

హరీష్ రావుపై గతంలో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. ఆ కేసులో హరీశ్ రావు నేరుగా ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు ఇచ్చారని, కుట్రలో భాగమయ్యారని చెప్పేందుకు సరైన ఆధారాలు లేవని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల దానిని కొనసాగించడం చట్టబద్ధం కాదని పేర్కొంటూ హైకోర్టు కేసును కొట్టివేసింది. హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా ప్రభుత్వానికి ఊరట లభించలేదు. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో ఆ నిర్దిష్ట ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తిగా ముగిసినట్టయ్యింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే హరీశ్ రావు గతంలో "హైకోర్టు, సుప్రీంకోర్టులు చెంప చెల్లుమనేలా తీర్పు ఇచ్చాయి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**ప్రభుత్వం వాదన ఏంటి..?**

అయితే, తాజాగా హరీష్ రావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ అనూహ్య పరిణామంతో రాజకీయాల్లో చర్చగా మారింది. ఇప్పుడు జరుగుతున్న దర్యాప్తు ఏంటి? అని చాలా మందిలో సందేహాలు ఉన్నాయి. ప్రస్తుత దర్యాప్తుపై స్పష్టత అవసరమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టులు కొట్టివేసింది ఒక్క ఎఫ్ఐఆర్ మాత్రమేనని, మొత్తం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జరగలేదని ఎక్కడా కోర్టులు చెప్పలేదని ప్రభుత్వం వాదిస్తోంది. అందుకే కొత్త కోణంలో, విస్తృత స్థాయిలో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై సిట్ విచారణ కొనసాగుతోందని అధికారులు వివరిస్తున్నారు. ఈ విచారణలో భాగంగానే హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం.

**బీఆర్ఎస్ వాదన ఏమిటి?**

హరీశ్ రావు సహా బీఆర్ఎస్ నేతల వాదన మాత్రం భిన్నంగా ఉంది. కోర్టులు ఇప్పటికే కొట్టివేసిన కేసునే మళ్లీ తిరగదవ్వడం ద్వారా రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యలు, అవినీతి అంశాల నుంచి దృష్టిని మళ్లించేందుకే ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తిరిగి తెరపైకి తెచ్చారని విమర్శిస్తున్నారు. మొత్తానికి, కోర్టుల తీర్పులు ఒకవైపు, సిట్ దర్యాప్తు మరోవైపు కొనసాగుతుండటంతో ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాల్లో ఇంకా ఎంత దూరం వెళ్తుందో చూడాల్సిందే.

**హరీష్ రావును అరెస్ట్ చేస్తారా?..**

దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో తొలిసారిగా బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్‌రావుకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న అనంతరం హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పేరిట ప్రభుత్వం రాజకీయ డైవర్షన్‌కు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. అవినీతి అంశాలపై ప్రశ్నిస్తే ఇలాగే కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి తన బావమరిది వ్యవహారాలు బయటపడగానే, అదే రోజున రాత్రి సిట్ నోటీసులు రావడం యాదృచ్ఛికం కాదన్నారు. తాను తాటాకు చప్పుళ్లకు భయపడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు చూసి సీఎం భయపడుతున్నారని, మున్సిపల్ ఎన్నికల్లో భారాస మరింత బలపడుతుందన్న ఆందోళనతోనే ఈ చర్యలన్నీ జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.

**హరీష్ రావుకు ఈ కేసుతో లింక్ ఏంటి?**

దర్యాప్తులో భాగంగా, శ్రవణ్‌రావు, ప్రభాకర్‌రావు, ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపై సిట్ దృష్టి సారించింది. ఒక ప్రైవేట్ కార్యక్రమంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు, ప్రభాకర్‌రావులు కలుసుకున్న సమయంలో ఎన్నికల సర్వేల అంశం చర్చకు వచ్చిందని శ్రవణ్‌రావు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. కొన్ని కీలక నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారికి సహకరిస్తున్న వ్యక్తుల ఫోన్ నంబర్లు సేకరించి నిఘా కోసం వినియోగించారన్న అనుమానంతో సిట్ విచారణ కొనసాగుతోంది. ఈ మొత్తం వ్యవహారానికి హరీశ్‌రావు–ప్రభాకర్‌రావుల భేటీనే బీజంగా భావిస్తూ, నిజానిజాలు తెలుసుకునేందుకే సిట్ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది.

# గ్రామీణ ఉపాధిని నాశనం చేస్తే సహించం

- కేంద్రానికి రాహుల్ గాంధీ హెచ్చరికలు
- అంబానీ, అదానీల కోసమే ఆర్థిక విధానాలంటూ ఆగ్రహం
- గాంధీ పేరు తొలగించడం చరిత్రకే అవమానమని వ్యాఖ్యలు
- కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా యూపీలో మహాపంచాయతీలు
- రాయ్‌బరేలీ పర్యటనలో రాహుల్ వెల్లడి

**రాయ్‌బరేలీ, (సిద్దిపేట పవర్):**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ అధికారాలన్నింటిని కేంద్రీకరించి, వాటిని బ్యూరోక్రసీ చేతుల్లో పెట్టాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. దీని వల్ల పేద ప్రజలు ఉపాధి లేక, ఆకలితో అలమటించే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. తన పార్లమెంటరీ నియోజకవర్గం రాయ్‌బరేలీలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించడం, కనీస వేతనం అందించడం ఉపాధి హామీ పథకం ప్రధాన లక్ష్యమని రాహుల్ గుర్తు చేశారు. అయితే కొత్తగా తీసుకొచ్చిన చట్టంతో పేదలకు ఉన్న రక్షణ కవచాన్ని కేంద్ర ప్రభుత్వం తొలగించిందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం వల్ల కోట్లాది కుటుంబాలకు పని లభించిందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అది వెన్నెముకగా నిలిచిందని చెప్పారు. అలాంటి చట్టాన్ని బలహీనపరచడం పేదల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

దేశ ఆర్థిక వ్యవస్థను కొద్ది మంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టడమే ప్రధాని లక్ష్యంగా పెట్టుకున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. అంబానీ, అదానీలకు మేలు చేసే విధానాలనే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని తెలిపారు. ఉపాధి అవకాశాలు తగ్గిపోతుండటంతో గ్రామీణ యువత వలస బాట పట్టాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని కూడా రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. గాంధీ ఆశయాలకు వ్యతిరేకంగా ఈ చర్య ఉందని, ఇది చరిత్రను, విలువలను తుడిచివేయాలనే ప్రయత్నమని అన్నారు. పేదల హక్కులు, గౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కూడా అని చెప్పారు.

రాయ్‌బరేలీ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ క్రికెట్ స్టేడియంలో రాయ్‌బరేలీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. యువత క్రీడల వైపు ఆకర్షితులవ్వాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం రోహనియా, ఉంచాహర్ ప్రాంతాల్లో గ్రామ సభలు నిర్వహించారు. అక్కడ కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి లేకపోవడం, వేతనాలు సకాలంలో అందకపోవడం వంటి అంశాలపై ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను రాహుల్ గాంధీ ప్రారంభించారు. రహదారులు, తాగునీటి సదుపాయాలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం వంటి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి రావాలని అన్నారు. పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై కూడా ఆయన చర్చించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన ఉద్యమాలు, ప్రజల మధ్యకు వెళ్లే కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.


ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా 30 మహాపంచాయతీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ తెలిపారు. ఉపాధి హామీ చట్టం రద్దు అంశంపై ప్రజలను చైతన్యపరచడమే ఈ కార్యక్రమాల లక్ష్యమని చెప్పారు. జనవరి 30న అమరవీరుల దినోత్సవం సందర్భంగా వార్డు స్థాయిలో శాంతియుత నిరసనలు చేపడతామని ప్రకటించారు. అలాగే ఫిబ్రవరి నెలలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు, అసెంబ్లీల ముట్టడి వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ పోరాటంలో రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా పాల్గొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పేదల హక్కుల కోసం, ఉపాధి భద్రత కోసం కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదని నేతలు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని కాంగ్రెస్ ప్రకటించింది.



# కంటోన్మెంట్ బోర్డు విలీనం అయ్యే వరకు పోరాటం ఆగదు

- **కంటోన్మెంట్ బోర్డు విలీనం అయ్యే వరకు పోరాటం ఆగదు**
- **రిలే నిరహార దీక్ష ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్, జనవరి 20 ( సిద్దిపేట పవర్ ):**




కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసే వరకు తన పోరాటం కొనసాగుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు. మంగళవారం కార్ఖానాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరహార దీక్షను ప్రారంభించారు. ఉదయం సర్వమత ప్రార్థనల అనంతరం నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిధులు లేని కంటోన్మెంట్ బోర్డు వల్ల ప్రాంత అభివృద్ధి నిలిచిపోయిందని, నామినేటెడ్ పాలనతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ఎంపీ ఈటెల రాజేందర్, కేంద్ర మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విలీన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. దీక్షకు కాంగ్రెస్ మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు, ఉద్యమకారుడు ఏపూరి సోమన్న తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, మేధావులు, సంఘాల ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాంధీలో తెలంగాణ ఫోరెన్సిక్ మెడిసిన్ స్టేట్ కాన్ఫరెన్స్

- **హెల్త్ మినిస్టర్ కు ఇన్విటేషన్..**

**సికింద్రాబాద్, జనవరి 20 ( సిద్దిపేట పవర్ ):**



గాంధీ మెడికల్ కాలేజ్, హాస్పిటల్‌లో ఏప్రిల్ 11, 12 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ఫోరెన్సిక్ మెడిసిన్ స్టేట్ కాన్ఫరెన్స్ కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు గాంధీ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కృపాల్ సింగ్‌తో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సందీప్, డాక్టర్ సూరజ్, డాక్టర్ లక్ష్మీకాంత్‌లు మంగళవారం హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ ను కలిసి ఆహ్వానించారు. కాన్ఫరెన్స్ ప్రాముఖ్యత, నిర్వహణ ఏర్పాట్లు, వైద్య విద్యార్థులు, ఫోరెన్సిక్ నిపుణులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. దీనిపై హెల్త్ మినిస్టర్ సానుకూలంగా స్పందించి కార్యక్రమానికి హాజరుకావడానికి తన సమ్మతిని తెలియజేశారు.ఈ రాష్ట్రస్థాయి సదస్సులో ఫోరెన్సిక్ మెడిసిన్ రంగానికి సంబంధించిన తాజా సాంకేతికతలు, పరిశోధనలు, న్యాయ వైద్య విధానాలు, కేసుల పరిశీలనలో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులపై నిపుణులు ప్రసంగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రముఖ వైద్యులు, అధ్యాపకులు, పరిశోధకులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నారని పేర్కొన్నారు.

# మృతుని కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్

**కొమురవెల్లి, జనవరి 20 (సిద్దిపేట పవర్)**



కొమురవెల్లి మండలం గురువన్న పేట గ్రామానికి చెందిన పుట్ట స్వామి గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు...విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ జహంగీర్ గౌడ్ మృతి చెందిన కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు..ఈ సందర్భంగా సర్పంచ్ పుట్ట స్వామి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా ఉంటామని గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో గ్రామం పెద్దలు, యువకులు పాల్గొన్నారు..

# రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా ఇంటికి చేరాలి

- **సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు**

**సిద్దిపేట టౌన్, జనవరి 20:**

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిద్దిపేట పట్టణంలోని భరత్ నగర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు వాహనదారులకు రోడ్డు నిబంధనలపై కీలక సూచనలు చేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ప్రజలందరూ సహకరించి సిద్దిపేటను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. అలాగే రోడ్లపై అతివేగంతో ప్రయాణించడం, ఓవర్‌లోడింగ్ చేయడం వలన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని పేర్కొని, వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వాసుదేవరావు స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక పోలీస్ సిబ్బంది, వాహనదారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి.. నీ తాటాకు చప్పుళ్లకు భయపడెదిలేదు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



రేవంత్ నువ్వెన్ని అక్రమ కేసులు మాజీ మంత్రి హరీష్ రావు పై పెట్టిన.. ఎన్ని రకాలుగా బి ఆర్ యస్ నాయకులను వేధించిన బీ ఆర్ యస్ సైనికులు భయపడే ప్రసక్తి లేదు అని మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి అన్నారు. మంగళవారం జగదేవపూర్ మండలం కేంద్రంలోని విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ కాంగ్రెస్ అంతు చూసే వరకు ప్రజల తరుపున నిలదీస్తూనే ఉంటాం. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పై ఇసోంటి పనికిమాలిన కేసులు పెట్టిన అదిరేది లేదు భయపడేది లేదు. ఏడికైతే ఆడికి... ఛలో చూసుకుందాం. అదృష్టం అందలం ఎక్కిస్తే రేవంత్ బుద్ధి మాత్రం బురదలోనే ఉందని అన్నారు. కేవలం ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక రెండు సంవత్సరాలుగా డైవర్షన్లకు పాల్పడుతున్నది కాంగ్రెస్ సర్కార్ కదా అని అన్నారు.ఇది సిట్ విచారణ కాదు, చిట్టి నాయుడి విచారణ రేవంత్,నువ్వు వేయి సిట్ లు వేసిన ఎంత శూనకానందం పొందిన నిన్ను వదిలి పెట్టాం. అలవికానీ హామీలిచ్చి గద్దెనెక్కి ఆ హామీలు చేయకుండా పనికిమాలిన లీకులతో ఇంకెన్ని రోజులు కాలం గడుపుతావ్. లీకులు ఇవ్వడం కాదు రేవంత్ రెడ్డి చేతకాని వాడిలా లీకులు ఇచ్చి చిల్లర రాజకీయాలు చేయకు. సిట్టు లీట్టు పొట్టు ఎన్నన్నా వేసుకో ఏమన్నా వేసుకో న్యాస్థానాలను గౌరవించే వ్యక్తి తన్నీరు హరీష్ అన్నారు. రేవంత్ రెడ్డి... కాస్కో నీ కుంభకోణాలు ఒక్కొక్కటి బయట పెడుతూనే ఉంటామని, కెసిఆర్ పోరాట త్యాగం నేర్పించారు. నివ్వు ఆడుతున్న నాటకాలు యావత్ తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మేము కెసిఆర్ సృష్టించిన సైనికులం చట్టం మీద గౌరవం ఉన్నా వ్యక్తి హరీష్ రావు భయపడడు.

# రెండేళ్లలో గజ్వేల్ నియోజకవర్గానికి రూ 1000 కోట్ల ప్రభుత్వ నిధులు

- **గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద రూ 1000 కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ధర్మారెడ్డి పల్లి, గజ్వేల్ లో జరిగిన వివిధ కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇక్కడి ప్రజలు కేసీఆర్ ను నమ్మి ఓటేసినప్పటికీ అందుబాటులో ఉండకపోగా ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయినట్లు విమర్శించారు. ముఖ్యంగా ముంపు గ్రామాల ప్రజలకు కెసిఆర్ హరీష్ రావులు అరచేతిలో వైకుంఠం చూపి నట్టేట ముంచగా వారి తొత్తులు నిర్వాసితుల నిధులు మింగేసినట్లు ఎద్దేవా చేశారు. కాగా జీతభత్యాల కోసమే ఎమ్మెల్యే పదవి పట్టుకొని కేసీఆర్ వేలాడుతుండగా, కాంగ్రెస్ కు అండగా నిలిస్తేనే గజ్వేల్ అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గానికి సీఎం రేవంత్ రెడ్డి అవసరమైన నిధులు ఇస్తుండగా, ముంపు బాధితుల సమస్యల పరిష్కారం తమతోనే సాధ్యపడుతుందని తెలిపారు. ముఖ్యంగా అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందజేస్తుండగా, ఆరు గ్యారెంటీలలో భాగంగా పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఆశీర్వదించాలని, అందుకు భిన్నంగా కెసిఆర్ కు ఓటు వేస్తే సిద్దిపేటలో మాత్రమే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. సీసీ రోడ్ల కోసం అడిగిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి రూ 18 కోట్ల నిధులు మంజూరీ చేసినట్లు చెప్పారు. రైతులు ప్రభుత్వ పథకాల కోసం ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని, పదవి ఉన్నా, లేకపోయినా గజ్వేల్ ప్రజలతోనే తన జీవితం ముడిపడి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అంక్షారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పెద్దిరెడ్డి అశోక్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శిలు మొనగారి రాజు, నక్క రాములు గౌడ్, నేతలు సుఖేందర్ రెడ్డి, ఊడేం శ్రీనివాస్ రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కప్ప భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక హరీశ్ రావు

- **బిఆర్ఎస్ మండల మహిళ అధ్యక్షురాలు మాజీ ఎంపీటీసీ కొత్త కవితా శ్రీనివాస్ రెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే గొంతుకగా గుర్తింపు పొందిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావుపై అక్రమ కేసులు పెట్టి రాజకీయంగా అణిచివేయాలని రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తోందని జగదేవపూర్ బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు మాజీ ఎంపీటీసీ కొత్త కవితా శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నించడం బొగ్గు స్కాం వంటి అక్రమాలను బయటపెట్టడం నేరమా? అని వారు నిలదీశారు.తెలంగాణ ఉద్యమనాయకుడిగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజల శ్రేయస్సు కోసం తపించే సేవకుడిగా హరీశ్ రావు 25 ఏళ్లకు పైగా తన రాజకీయ ప్రస్థానంలో నైతిక విలువలను పాటిస్తూ పట్టుదలతో పనిచేసి ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు, హైకోర్టులు కొట్టివేసిన తర్వాత కూడా హరీశ్ రావుపై అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకను అణిచివేయాలనే కుట్రలు ఎప్పటికీ ఫలించవని స్పష్టం చేశారు.ఈ పరిణామాలన్నింటినీ తెలంగాణ సమాజం గమనిస్తోందని యావత్ తెలంగాణ ప్రజలు హరీశ్ రావు వెంట ఉన్నారని వారు తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే వ్యక్తి కాదని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# కంటోన్మెంట్ ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి

- **బానుక నర్మద మల్లికార్జున్**

**సికింద్రాబాద్, జనవరి 20 ( సిద్దిపేట పవర్ ) :**



కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలపై ఎమ్మెల్యే శ్రీ గణేష్ గారు ప్రత్యేక దృష్టి సారించాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు, బీజేపీ నాయకురాలు బానుక నర్మద మల్లికార్జున్ కోరారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... కంటోన్మెంట్‌లో మంచినీటి సరఫరా, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, నష్టపరిహారం, TPT బకాయిల వంటి అంశాలు ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం కంటోన్మెంట్ పరిధిలో ప్రజలకు 4 నుంచి 5 రోజులకు ఒక్కసారి మాత్రమే మంచినీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని శాశ్వత పరిష్కారం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా రోడ్డు వెడల్పు, భూసేకరణ అంశాలపై ప్రజల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయని చెప్పారు. ఈ విషయంపై HMDA అధికారులతో చర్చించి ప్రజలకు స్పష్టత కల్పించాలని సూచించారు. అదేవిధంగా ప్రాజెక్టుల వల్ల ప్రభావితమయ్యే ప్రజలకు అందించాల్సిన నష్టపరిహారంపై పారదర్శకత అవసరమని పేర్కొన్నారు. అర్హులైన వారికి త్వరితగతిన పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ద్వారా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కంటోన్మెంట్‌కు రావాల్సిన సుమారు రూ.100 కోట్ల TPT బకాయిలు ఇంకా విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిధుల విడుదలకు ప్రభుత్వం వద్ద గట్టిగా ప్రయత్నాలు చేయాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధుల మధ్య పరస్పర గౌరవం అవసరమని, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- **సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి..**

**చేర్యాల, జనవరి 20 (సిద్దిపేట పవర్)**



ఈ రోజు చేర్యాల పట్టణంలోని కళ్యాణి గార్డెన్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అందరూ సమాజంలో ఆదర్శంగా జీవించాలి అని దాని కోసం ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకోవాలి అని తెలిపారు.. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, చేర్యాల పట్టణ మహిళలు పాల్గొన్నారు..